క్లుప్తంగా

యువకుల రక్తదానం



బోధన్‌టౌన్(బోధన్): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు ప్రమోద్ కుమార్ మాట్లాడారు. యువకులు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, రక్తదాన చేయడం అంటే ఒకరికి ప్రాణదానం చేయడమే అని అన్నారు. తుమ్మల దేశయ్య, లక్ష్మీనారాయణ, దామోదర్ రెడ్డి, నాగార్జున, శివ, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల తనిఖీ



ఎడపల్లి(బోధన్): ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారని ఉన్నతాధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. బోధన్ ప్రధాన రహదారిపై ఎడపల్లిలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఆపి పరీక్షలు నిర్వహించారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి పండరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృంద సభ్యులు బస్సులను పరిశీలించారు.

ఆరోగ్య మహిళ శిబిరం



బోధన్: ఆయుష్మాన్ ఆరోగ్య మహిళా మేళా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య మహిళ వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు, బాలికలకు వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలు చేశారు. డాక్టర్ రహీం, స్కిన్ స్పెషలిస్టు నరేష్, గైనకాలజిస్టు సుబాంగీ, చిల్డ్రన్స్ స్పెషలిస్టు విఘ్నేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

కోటగిరిలో..




రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సీహెచ్‌సీలో ఆరోగ్య మేళా కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి సూచనలు చేశారు. 57 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ విజయ, సుభాషిణి, మమత, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ



పోతంగల్(రుద్రూర్): పోతంగల్ పీహెచ్‌సీలో కాలం చెల్లిన మందులను పంపిణీ చేసినట్టు తెలుసుకున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ శుక్రవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామాన్ని సందర్శించారు. మందులు తీసుకున్న మహిళ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మందులు వేసుకున్న యువతి ఆరోగ్యంగా ఉందని, ఎలాంటి రియాక్షన్ లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన ఎన్ఆర్ఐ సామ నరేందర్ తన వంతుగా రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అందుకు సంబంధించిన నగదును శుక్రవారం నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలు ముందుకు వచ్చి స్టేడియం పూర్తయ్యేలా సహకరించాలని కోరారు. నిర్మాణ కమిటీ సభ్యులు గంగాధర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. చికిత్సకు భారీ మొత్తం కావాల్సి ఉండగా బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని సంప్రదించగా ఆయన రూ.2.60 లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేశారు. కుటుంబ సభ్యులు సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- ఇబ్బందుల్లో చిన్నారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అద్దె భవనంలో కొనసాగుతున్న కేంద్రం



ఇరుకు గదిలోనే చిన్నారులకు ఆటాపాట నేర్పిస్తున్న అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు

మాక్లూర్: అప్పుడప్పుడే అడుగులు వేస్తూ వచ్చీరాని మాటలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే చిన్నారులకు అక్కడ సరైన వసతులు, సొంత భవనాలు అంటూ లేకపోవటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకు మాక్లూర్ మండలాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. మండలంలో మొత్తం 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 23 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మరో 6 నిర్మాణంలో ఉన్నాయి. మిగితా 45 అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అవి కూడా పాడుబడిన పెంకుటిండ్లు, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల్లో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. మంచి పోషకాహారం అందిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో ఉల్లాసాన్ని కల్పిస్తూ దోహదపడాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు ఇరుకు గదులు, అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగటంతో లక్ష్యం నీరుగారుతోంది. గర్భిణీలతో పాటు చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహారం, గుడ్లు భద్రపరిచేందుకు ప్రత్యేక గదులు లేవు. గత్యంతరం లేక అంగన్‌వాడీ ఉపాధ్యాయులు వారి ఇళ్లల్లోనే భద్రపరుస్తున్నారు. దీంతో కొందరు అంగన్‌వాడీలు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ఈ విషయమై అధికారులు స్పందించి వెంటనే భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలి. అందుకు ప్రభుత్వం ఈ సారైనా నిధులు కేటాయించాలి. సంవత్సరాల తరబడి అనేక చోట్ల అంగన్‌వాడి కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇరుకు గదుల్లో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఈ విషయాన్ని గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలి.

– సవిత, జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రగతిశీల మహిళా సంఘం

పాలకుల దృష్టికి తీసుకెళ్లాం

సొంత భవనాలు లేని అంగన్‌వాడీల విషయమై గతంలో పాలకులతో పాటు అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లాం. మంజూరు చేయిస్తాం అంటూ చెప్పారు. ఇప్పటివరకైతే కొత్త భవనాలు మంజూరు కాలేదు. సొంత భవనాలు లేక నిర్వహణ ఇబ్బందిగా ఉంది.

–వరలక్ష్మి, ఐసీడీఎస్ అధికారిణి, మాక్లూర్

బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ బిల్‌కలెక్టర్లు

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులర్ చేయాలని ఆర్మూర్ మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు మున్సిపల్ కమిషనర్ రాజును కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా జీపీ నుంచి పురపాలక సంఘంలో విలీనమై బిల్ కలెక్టర్‌గా, ప్రభుత్వ పథకాలకు సంబంధించి అన్ని సర్వేలను, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ముందుండి పనిచేస్తున్నామన్నారు. జీతాలు పెంచి రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు పూర్తి చేయండి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యను కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. డ్రైనేజీ నిర్మాణం పూర్తికాకపోవడంతో బస్టాండ్‌లో బస్సులు బయటకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందన్నారు. బస్సులు ఒకే చోట నుంచి పోవటం రావటం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. నాయకులు కూతాడే ఎల్లయ్య, తోకటి భువనేశ్వర్, భామండ్ల రవి, కుల్దీప్ శర్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తాగునీటిని అందించాలి



సర్వేను పరిశీలిస్తున్న డీపీవో తరుణ్

వర్ని (మోస్రా): గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికి తాగునీటిని అందించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం మోస్రా మండల కేంద్రంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను పరిశీలించారు. నీరు వృథా కాకుండా, లీకేజీలు లేకుండా స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న సర్వేలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని మిషన్ భగీరథ నీగొ సరఫరాల్లో లోపాలను గుర్తించి వాటిని సరిచేయాలన్నారు. డీఎల్‌పీవో సాయిబాబా, ఎంపీవో మహమ్మద్ రఫీ, కార్యదర్శి ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోండి



బోధన్‌టౌన్(బోధన్): డివిజన్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రితో పాటు మండలాల్లోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో ప్రతి నెలా 14న నిర్వహించే ఆయుష్మాన్ ఆరోగ్య మేళాను సద్వినియోగం చేసుకోవాలని పబ్లిక్ హెల్ నర్సింగ్ ఆఫీసర్ నిర్మల కోరారు. శుక్రవారం బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయుష్మాన్ ఆరోగ్య మేళాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌ఎన్‌వో నిర్మల మాట్లాడారు. ఈ మేళాలో బీపీ, షుగర్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి, పిల్లలకు, మహిళలకు ఆయా విభాగాల వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. నిజామాబాద్ నుంచి వైద్యులను రప్పించి వర్ని, కోటగిరి పీహెచ్‌సీలకు పంపించామని తెలిపారు.

తైబజార్ వేలంలో సిండికేట్ రాజకీయం

- కాంట్రాక్టును దక్కించుకుంటున్న మహిళా కౌన్సిలర్ల భర్తలు
- నేడు ఆర్మూర్ తైబజార్ వేలం పాట



ఆర్మూర్ పట్టణంలో కూరగాయలు అమ్ముతున్న చిరు వ్యాపారులు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ వేలం పాటలో అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా మారి ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచి వేలం పాటను చేజిక్కించుకోవడం ప్రతి ఏటా పరిపాటిగా మారింది. ఆర్మూర్ పట్టణంలో అంగడితో పాటు అరూర్, పెర్కిట్, మామిడిపల్లిల్లో వీధుల్లో కూరగాయలు అమ్మే వారికి మున్సిపాలిటీ నుంచి పన్ను విధిస్తారు. వీధుల్లో, అంగడిలో కూర్చొని వ్యాపారం చేసుకొనే రైతులకు రోజుకు రూ.20, బేరగాళ్లకు రోజుకు రూ.30 చొప్పున పన్నును వసూలు చేస్తారు. అయితే ఈ పన్ను వసూలు చేయడం మున్సిపల్ అధికారులకు ఇబ్బందిగా ఉండటంతో ప్రతీ ఏటా తైబజార్ వేలం నిర్వహించి కాంట్రాక్టర్‌కు కేటాయిస్తారు. మూడేళ్లుగా మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉండటంతో మహిళ కౌన్సిలర్ల భర్తలు సిండికేట్‌గా మారి ప్రతి ఏడు ఒకరు చొప్పున తైబజార్ వేలంను చేజిక్కించుకోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఈ నాయకులు పార్టీలు మారి ప్రస్తుత అధికార పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో ఈ నెల 15న ఆర్మూర్ మున్సిపాలిటీలో నిర్వహించనున్న తైబజార్ వేలంలో వీరే కీలకంగా మారి సిండికేట్ రాజకీయం చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థులుగా వచ్చే వారిని నయానో, బయానో ఒప్పించి పోటీ నుంచి తప్పించుకొనేలా చేయడం గతంలో చాలా సార్లు జరిగింది. దీంతో ప్రస్తుతం నిర్వహించనున్న తైబజార్ వేలంలో ఇలాంటి అక్రమాలకు తావియ్యకుండా పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని పలువురు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో మగ్గం వర్క్‌లో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం ట్రైనింగ్ సర్టిఫికెట్లను ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కొత్తపల్లి రమేష్, వీఎల్‌వో ఎం.మంజుల అందజేశారు. స్వచ్ఛంద సంస్థ అభయ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 30 మంది మహిళలకు నెల రోజులు పాటు శిక్షణ ఇచ్చారు.

సర్వేను వెంటనే పూర్తి చేయాలి

బాల్కొండ: మిషన్ భగీరథ సర్వేను వెంటనే పూర్తి చేయాలని డీఎల్‌పీవో శివరామ కృష్ణ ఆదేశించారు. శుక్రవారం ముప్కాల్‌లో మిషన్ భగీరథ సర్వేను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి తిరుగుతు సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. నల్లాతో పాటు, కుటుంబ యజమాని ఫొటో తప్పకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఎంపీవో భరత్, తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై డొంకేశ్వర్ మండలం గంగసముందర్ గ్రామ పంచాయతీలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వంట పాత్రలపై మూతలు ఉంచాలన్నారు. అలాగే మురుగు కాల్వలు, నీరు నిలువ ఉన్న కుండీల వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి నిఖిల్, ఏఎన్‌ఎం మైముదా బేగం, ఆశా వర్కర్ లత పాల్గొన్నారు.

ఉచిత సేవలను వినియోగించుకోవాలి

ఆర్మూర్: భవిత కేంద్రంలో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం సూచించారు. ఆర్మూర్‌లోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సెరిబ్రల్ పాల్సీతో బాధపడే విద్యార్థులకు వైద్యులు రేణుకా చికిత్స చేశారు. ఐఈఆర్పీ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట, మాక్లూర్ మండలాల విద్యుత్ వినియోగదారులకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఎం.అశోక్ తెలిపారు. నందిపేటలోని 133/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘పంటసాగు ప్రణాళిక రూపొందించలేదు’



మాక్లూర్: వర్షాకాల పంటసాగు ప్రారంభమై పక్షం రోజులు అవుతున్నా ప్రభుత్వం ఇంకా ప్రణాళిక రూపొందించలేదని అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సాయిరెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ఇప్పటివరకు సీజన్‌కు సంబంధించి ఎలాంటి సూచనలు ఇవ్వలేదన్నారు. ఫలితంగా రైతులు అయోమయంలో పడిపోయారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన సూచనలు చేయాలని డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యక్షుడు బన్ని, సరోజన, నాగేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించండి



పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వీడీసీ చైర్మన్ అశోక్

మాక్లూర్: తల్లిదండ్రులు వారి పిల్లల్ని స్థానికంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. శుక్రవారం చిన్నాపూర్, అడవి మామిడిపల్లి పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం అమ్మ ఆదర్శబడి పనులను పరిశీలించారు. ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసీ సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎలాలవాడ ప్రాథమిక పాఠశాలలో..

మోర్తాడ్: మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎలాలవాడ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను వీడీసీ చైర్మన్ జక్కం అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దండు గంగాధర్, ఉపాధ్యాయులు సరోజా దేవి, శైలజ, వీడీసీ వైస్ చైర్మన్ నూతుల రాజేందర్, కోశాధికారి దడివె అశోక్, కార్యదర్శి పుప్పాల రాజ్‌విఠల్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ సంగీత

వడ్డెరకాలనీ పాఠశాలలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని వడ్డెరకాలనీలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా దుస్తులు, పాఠ్య పుస్తకాలను అందిస్తోందని అన్నారు. పాఠశాల హెచ్ఎం తుమ్మల లక్ష్మణ్, పాఠశాల ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, సునీత, సంధ్య, రాజేంద్ర ప్రసాద్, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

– బోధన్ ఇన్‌చార్జి ఎంఈవో నాగనాథ్



పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాగనాథ్

బోధన్‌రూరల్: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు లభిస్తాయని బోధన్ ఇన్‌చార్జి ఎంఈవో నాగనాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో నాగనాథ్ పాఠ్యపుస్తకాల సెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టీచర్లు భాస్కర్, ఇక్బాల్, ఎంఐఎస్ నాగేష్, సీఆర్‌పీలు విజయ్ బాబు, శివానంద్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్ఎం హరిత శుక్రవారం తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన పరీక్షల్లో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హత సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం ఉపకార వేతనాన్ని అందజేయనుంది. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మరో ఇద్దరు విద్యార్థినులు..

డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మి దో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థిను లు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీ మ్‌కు (ఎన్‌ఎంఎంఎస్) ఎంపికయ్యారు. ఇందు లో గంగాసముందర్‌కు చెందిన ఎం. శ్రీహన్య, దత్తాపూర్‌కు చెందిన కె.స్వాతిక ఉన్నారు. వీరు గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాశారు. నేషనల్ స్కాలర్ షిప్‌కు ఎంపికై న వీరికి తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12,500 స్కాలర్‌షిప్ రానుంది. తమ పాఠశాల నుంచి నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంపై హెచ్ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్ పంపిణీ



రుద్రూర్: అక్బర్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్‌ను శుక్రవారం పాఠశాల హెచ్ఎం రవి కుమారి అందజేశారు. విద్యార్థులకు సొంత ఖర్చులతో హెడ్‌మాస్టర్ స్కూల్ బ్యాగులను ఇవ్వడంతో విద్యా కమిటీ సభ్యులు అభినందించారు. అక్బర్‌నగర్ ఉర్దూ మీడియం, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. మాజీ సర్పంచ్‌లు తిగుళ్ల గంగామణిప్రసాద్, సద్గుణ సరస్వతి, మాజీ ఉప సర్పంచ్ సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేరిక

మాక్లూర్: అమ్రాద్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసుకున్న 15 మంది విద్యార్థులను శుక్రవారం ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెట్టు లక్ష్మీనారాయణ చేర్పించారు. ప్రత్యేక శ్రద్ధతో తల్లిదండ్రులను ఒప్పించి విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించిన లక్ష్మీనారాయణను ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. పీఈటీ లక్ష్మి, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు సుమలత, సాయన్న, రమేష్, గంగాధర్‌లు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మహారాజా (తెలుగు) - 12.45, 6.40, 9.45 మ్యూజిక్ షాప్ మూర్తి (తెలుగు) 3.50
స్క్రీన్-2 –	హరోం హర (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	చందు చాంపియన్ (హిందీ) - 12.10, 6.05, 9.15, నీ దారే నీ కథ (తెలుగు) - 3.20

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)

Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ శివ : 9848956776
బాల్కొండ ప్రశాంత్ : 8919850800
బోధన్ కృష్ణ : 7997958178
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899